# క్విట్ కాశ్మీర్!

శ్రీ పి. లక్ష్మీకాంత మోహన్

"అమ్మోయ్!"

"ఆc! యెక్కడున్నావురా పొద్దుట్నించీ? అదేమిటట్లా రొప్పుతూ పరుగెత్తుకొచ్చావు?"

"వూరికినే. మరేc.....పట్నం వెళ్ళా"

"పట్నం లాక్కొచ్చావా వెంబడి?"

"లేదమ్మా. ఉహు... మరేc అక్కడ......పట్నంలో అబ్దుల్లా మామాయి వుపన్యాస మిచ్చాడు."

"హరిసింగ్ రాజును హతమారి పొమ్మనిగాదూ?"

"ఊ! సాయంత్రం వూరేగింపు. నేంగూడా పాటలు పాడాలి వెళ్తన్నా"

"మరి యెందుకొచ్చినట్లు! యిదుగో కాస్త అన్నం తినిపో. రొట్టె యిదిగో..."

"నాకాకలిగా లేదమ్మా"

"ఛా, వెధవాయి! కడుపట్లా దించుకుపోతేను!"

"అమ్మతోడమ్మా. ఆకలెయ్యటం లేదు."

"సరే! అట్లాఅయితే, యిదుగో యీ పెనం దించేసి నేంగూడా వస్తా; పోతూండు"

"అమ్మా!"

"యేంరా నాయనా!"

"అమ్మా......నువ్వొక్కదానివి ... పోలీసులు ... లారీలు ...ఓహో... యేం లేదమ్మా"

"అయితే బాబూ, నేను గాదురా నిన్ను కని, పెంచిందీ!"

"వూరికినే అన్నానమ్మా. యేమనుకోమాక!"

"పోయి రారా పిచ్చి బాబూ. ఇదుగో అబ్బాయి! మోటారుబళ్లూ అవీ వుంటాయి జాగ్రత్త.

ఇదుగో... మెయినురోడ్డుగుండా పో మాకు. ఇటుగుండా వెళ్లు. వోరే...అబ్బాయి......”

ఆమెయింకా యేమేమో చెప్పుతుండగానే, చూపును దాటిపోయాడు కొడుకు. ఆమె వితంతువు. మీర్జా వొక్కడే కొడుకు; పన్నెండేళ్ల వాడు. పట్నంలోవుంటే ‘కలవారికి’ చిరాకుగా వుంటుందని దూరాన్నవున్న కూలీవాళ్ల పేటల్లో వుంటున్నారు. మీర్జా వో పండ్ల దుకాణదారువద్ద అమ్మే కుర్రాడుగా కుదిరాడు. పండుగ దినాల్లోనూ, ఆదివారంపూటా బజార్లెమ్మట ‘యాపిలుపళ్లు, ద్రాక్షపళ్లోయి!’ అని కేకలేస్తూ అమ్ముతాడు.

ఆ పేటకు దూరంలోవున్న వో పల్లెలోని భూస్వామియింట్లో ఆమె పనికత్తె. యీరోజున ఆమెవంట్లో సుస్తీగా వుండి పనిలోకి పోలేదు. ఐనా ఆమెకు భయంగానే వుంది. అయ్యగారు యేమంటారో!

ఆమె త్వరగా చేసేపని ముగించి చేతులో వొక పొట్లాం పట్టుకొని బయలుదేరింది శ్రీనగర్ కు.

దేవదారు తోటలు, పూల తోటల వరుసలు, తెల్లవాళ్ల బంగళాలు, వ్యాపారుల భవనాలు గబగబ వెనక్కి జరుగుతున్నాయి ఆమె ముందడుగేస్తూంటే.

అదుగో! ఆరోడ్డు మలుపులో యెవరో వున్నట్టున్నారే! .... యేదో మీటింగల్లే వుంది..... ఓహో రసూల్ తాతయ్య, జయరాం బాబాయిగూడా వున్నారే! ఈ ముసిలివాళ్లు యెట్లా పసిగడతారో యేమో, ఎక్కడమీటింగు జరిగితే అక్కడల్లా తయారౌతారు. పాపం రసూలుతాతయ్య బీదరైతు. ఇంటినిండా పిల్లలు. యెన్నో బాధలు. జయరాం బాబాయీ అంతే. వీరిద్దరు తమకేదో మంచిరోజు వుందని, కష్టాలు పోతాయని మీటింగుల కొస్తారు. తమబోటి పేదల కష్టాలుపోయే రోజు వస్తుందా? యీ రాజు నాశనమౌతాడా?

“యీ రాజు నాశనమౌతాడు. మనపిల్లల, తల్లుల పచ్చిమాంసం తినే యీ రాజు నాశనమౌతాడు” ఆజానుబాహుడైన వొక యువ

కుడు ప్రసంగిస్తున్నాడా విధి మీటింగులో "మన పచ్చి రక్తాన్ని తాగడానికి యీ రాజుకు అధికారం యెవ్వరిచ్చారు? మనమంతా చెమటరూపంగా నెత్తురు గార్చి పండిస్తుంటే, వస్తువుల్ని తయారు చేస్తుంటే యీరాజు మనకష్టాన్ని దోచుకొని దాన్తో కుక్కల్నీ, గుర్రాల్నీ పెంచుతున్నాడు. కుక్కలకంటేమనం— కూలి రైతులం – హీనమయ్యామా యీ రాజుదృష్టిలో? యీరాజు ......"

సభలో గడబిడబయలుదేరింది. తలావొక రకంగాతిట్టుతూ, వేడి సెగలు కక్కుతున్నారు సభికులు.

"ఈరాజు పందికన్నాహీనం!" యెవరో అరిచారు.

మళ్లీ ఆ యువకుడు ప్రారంభించాడు "యిలాంటిరాజ్యం మనకొద్దు. ప్రజలంతా ఎన్నుకొన్న ప్రభుత్వం కావాలి. కనక మనమంతా, ప్రాణాలకు లెక్కచెయ్యకుండా స్వాతంత్ర్య పోరాటం నడపాలి. హరిసింగ్ ... హంతకుడా! క్విట్ కాశ్మీర్!" ఆ ప్రసంగీకుడు గర్జించాడు.

"క్విట్ కాశ్మీర్!" అక్కడున్న వారందరి హృదయాల్లోనూ ప్రతిధ్వనించిందది. అక్కడకూచున్న మీర్జాతల్లి నాడుల్లో చిమ్మికొట్టింది వేడిరక్తం. ఆమె వుద్రేకంతో కంపించింది.

జయరాం బాబాయితో అన్నాడు రసూలు తాతయ్య "హరిసింగేగాదు. ఈయనమంత్రి, మనవూళ్లో దిగిన పోలీసుమూక గూడా పోవాలి. నాశనంగావాలి. బూడిదై పోవాలి......"

"కక్కాయి! రాజు పోతే రాజుతోపాటు అంతా పోతారు. తాచుపాముతలకాయచితకబొడిస్తే విషమూ కోరలూ వుంటాయా?" జయరాం బాబాయి సమాధానపరిచాడు.

"హుం" రసూలు తాత మీసం మెలిపెట్టేడు.

"తాతయ్యా! మా మీర్జా అప్పుడించాడానీకు?" ఆమె అడిగింది.

"లేదమ్మాయి! ముందోక వూరేగింపు పోయింది. దాన్తో పాటు వెళ్లాడేమో! అయినా మీ వాడికికాలుఆగుతుందాచేస్తుందా?

యెక్కడతిరుగుతున్నాడో ఏమో" రసూల్ తాత చెప్పేడు.

అయినా ఆమెకు సందేహం గానేవుంది. మీటింగు కొచ్చిన పిల్లల్లో వున్నాడేమో! అదుగో మీర్జా! దగ్గరకుపోయింది. మెచ్చే, మీర్జాగాడు. యెవరో అబ్బాయి. అక్కడ లేడు మీర్జా.

ఆమెయింకా ముందుకునడిచి పోసాగింది. త్రోవలో యెక్కడ చూచినా పండుగగా వుంది. రకరకాల, రంగురంగుల దుస్తులు ధరించిన ప్రజల్తో హడావిడిగా వుంది. సంధ్యాకాలపు సూర్యుడు లేగులాబీ కాంతిని విరజిమ్ముతున్నాడా ప్రజలమీద. తలెత్తిచూస్తే వారికి ఆకాశం నిప్పుమబ్బుల్తో తగులబడి పోతూన్నట్లుంది. ఈప్రజల్ని బురదను చెదరగొట్టినట్లుగా చెదరగొట్టేస్తున్నాయి, పరుగెత్తే పోలీసులారీలు.

లారీలు! యెక్కడికీ పోలీసు గుంపు? అవిదూసుకుపోతుంటేగాలివానకు చెట్టుమొదలువూగినట్లుగా ఆమె హృదయం వూగసాగింది. మీర్జా!?

చీకటి పడసాగింది. మంచు తలపాగాలు ధరించిన హిమనగ శిఖరాల్నించి జిల్లుమనిపించే చలిగాలి వీవసాగింది సుడులు సుడులుగా. ఆమె నరాలు గిజగిజమంటున్నాయి.

ఆమెకు భయంగావుంది. దోవ కనపట్టంలేదు. మీర్జా యెక్కడున్నాడో! యిప్పుడు పెద్ద బజారుగుండా పోతూన్నదామె. సన్నని పొగమంచు చుట్టూ కమ్మివుంది. యీ పొగమంచులో, చీకట్లోనిశ్చలంగా నిలబడి గుడ్డికాంతిని వదుల్తున్నాయి యెలక్ట్రిక్ దీపాలు. వాటి స్తంభాలకిందనిలబడి పరకాయించి చూసిందామె. ఉహూ—మీర్జా అవుపట్టంలేదు.

బంగరు కాశ్మీర్ బీదలబోనూ పంటలు వుండీ పొట్టమాడుటలు
ప్రజారాజ్యముగ చేయగ కాశ్మీర్
పదండిముందునకే,
...... పదండిముందునకే!

ఆమెదగ్గరగా దూరానికి దూసుకుపోయింది పాట. ధన్... యిద్ధన్...ధన్...... ! ఆపాట వెళ్ళినదారిగుండా కాళ్ళులు విన

వస్తున్నాయి. అటు పరుగెత్తిందామె. అక్కడకు చేరింది. అమ్మో! జనంమీద... కుక్కలు... పూరేగింపుమీద!

మంచుపొగలో మందుగుండ్ల పొగ కలసి పోయి నల్లనికావురు గమ్మింది. నల్లని తెల్లని ఆకారాలు కిందపడుతున్నాయి; లేస్తున్నాయి. రాళ్ళవర్షం... కేకలు, తిట్లు!

"క్విట్ కాశ్మీర్!" గంభీరంగానిలబడి మెల్లగా తలలూపుతున్న దేవదారు వృక్షాల మీదిగా పోయి కొండశిఖరాల్ని తన్ని తిరిగొస్తోం దాధ్వని! కో ర్కే...!! హక్కు...!!!

యెవరో మూల్గుతున్నారు; పడుస్తున్నారు; అరుస్తున్నారు; చప్పట్లుగొడుతున్నారు, నవ్వుతున్నారు! బాణంలాగా ఆమె పాదాలనించి తలవరకు యేదో శక్తి దూసుకుపోయింది. తన సోదరుల మీాద పోలీసులు. ఆమెగూడా రాళ్లురువ్వ సాగింది.

యెవరా కుర్రాడూ! మీర్జా అయివుంటాడు.

"వోరే నాయనా! మీర్జా!"

"............"

"నాయనా మీర్జా!"

"..............."

"మీర్జా!"

"అమ్మా!"

అటుపరుగెత్తిందిఆమె. యిదిగో యిక్కడ పడివున్నాడు మీర్జా. వొళ్లు చల్లగావుంది. యెడమజేబు తూటుపడివుంది. తడివింది. రక్తం! ఆమె రక్తంలోని రక్తం! మీర్జా!

"మీర్జా! నాన్నా! నువ్వెవరికేం అన్యాయం చేసావురా!" మీర్జా పలకలేదు; యికలేడు. మీర్జా లేతపెదవుల్నీ, బుగ్గల్నీ ముద్దాడిందామె!

"యెవరు ముండా నువ్" గురిపెట్టిన తుపాకీతో, నలుపక్కలకీ నిక్కిచూస్తూ వచ్చిన వో పోలీసు భౌభౌ మన్నాడు.

ఆమె పలకలేదు.

"యెవితివే లం..." ఆమెపలకలేదు. ఒల్చుకో లేదు. ఆపోలీసు మీర్జాను చూడకుండా గట్టిగా కావలించుకొంది.

ఢన్... ఆమె పడిపోయింది. ఇప్పుడు తల్లీకొడుకులు వొక్కటై పోయారు. వున్నట్టుండి ఆ వీరుల ఏకత్వంనించి వొక శక్తి పుట్టింది.

చూస్తూండగానే అది పెద్దదైంది. ఆ పోలీసుకు భూతంలా కనిపించిందా శక్తి.

"క్విట్ కాశ్మీర్!" ఆశక్తిబొబ్బరించింది. యెదట వున్న పోలీసు తునాతునక లయ్యాడు. దూరాన వున్న రాజభవనం పునాదుల్లోనహా వూగుతూంది అటూయిటూ.

"క్విట్ కాశ్మీర్"

"నిజమే నిజమే.

అంతే అంతే" అని హిమ నగశిఖరాలు గంభీరంగా ప్రతిధ్వనిస్తున్నాయి!

# శ్రీ గిడుగు వేంకటరామమూర్తిగారి వర్ధంతి

ఆంధ్ర సాహిత్యంలో మన ప్రజలు నిత్యం వ్యవహరించే భాషను ప్రవేశపెట్టి, మన వాఙ్మయానికి కొత్త చైతన్యం రేకెత్తించిన శ్రీ గిడుగు రామమూర్తిగారు చిరస్మరణీయులు. వారు తమ కార్యభారాన్ని మనపై వదలి, అప్పుడే ఎనిమిది సంవత్సరాలయింది. ఆయన ప్రారంభించిన వ్యావహారికోద్యమం నానాటా పెంపొందింది. ఈ నాటి ఆంధ్ర సాహిత్యమంతా వ్యావహారికభాషలోనే వస్తున్నది.

కాని, ఈనాటికీ మన విశ్వవిద్యాలయం, ప్రభుత్వం వ్యావహారికభాషను గుర్తించనే లేదు. నేటి ఉత్తమ సాహిత్యమంతా వారికి నిషిద్ధమైంది. భావి పౌరులుగా పెంపొందవలసిన విద్యార్థులకు అత్యవసరమైన ఈ సాహిత్యం అందకుండా, అధికారులు, తమ ఆంక్షలతో అడ్డుపడి, వారి అభివృద్ధినీ, మన వాఙ్మయాభివృద్ధినీ అరికడుతున్నారు. ఎన్ని సంస్థలు ఎన్ని తీర్మానాలు చేసినా, ఎన్ని సార్లు హెచ్చరించినా, అధికారులు లక్ష్యపెట్టక, ఇంకా అకృతకభాషనే పట్టుకు వ్రేలాడుతున్నారు.

ఈ పరిస్థితుల్లో మనం శ్రీ గిడుగు రామమూర్తిగారి వర్ధంత్యుత్సవాన్ని జనవరి 22-న జరుపుకొంటున్నాం. ఆయన ఏ వ్యావహారికభాషకోసం నిరంతరం కృషిచేశాడో, ఆ వ్యావహారిక భాషను విశ్వవిద్యాలయాలూ, ప్రభుత్వ విద్యాశాఖా ఆమోదించేటట్లు చెయ్యవలసిన బాధ్యత మన మీద వుంది.

కనుక, అభ్యుదయ రచయితలూ, తదితర సాహితీపరులూ అందరూ కలిసి, జనవరి 22-వ తేదీన శ్రీ రామమూర్తిగారి వర్ధంతిని జయప్రదంగా జరిపి, వ్యావహారిక భాషను గూర్చి తీర్మానాలు చేసి ప్రభుత్వానికీ, విశ్వవిద్యాలయాధికారులకూ అందజేయాలని కోరుతున్నాం.

— కార్యదర్శులు,

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం.